క్లుప్తంగా

ఏటీఎం సేవలు ప్రారంభం

మల్హర్ : మండలంలోని తాడిచర్ల సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఏటీఎం సేవలు ప్రారంభమైనట్లు తాడిచర్ల కేడీసీసీ బ్యాంకు మేనేజర్ వెంకటరాజం బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరాజం మాట్లాడుతూ.. తాడిచర్ల సహకార (కేడీసీసీ) బ్యాంకు ఆవరణలో ఏటీఎంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఖాతాదారులు, మండల ప్రజలు ఏటీఎం సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

'సిబిల్ స్కోర్' సరికాదు

టేకుమట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బచ్చల రజినీకాంత్ బుధవారం తెలిపారు. వందల కోట్లు ఎగ్గొడుతున్న పారిశ్రామిక వేత్తలు, కాంట్రాక్టర్లకు బ్యాంకులు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు మంజూరు చేస్తున్నాయని అన్నారు. కానీ బడుగు, బలహీన వర్గాలకు చెందిన లబ్ధిదారులకు మాత్రం నిబంధనలు పెట్టడం సరికాదన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



చిట్యాల : మండలంలోని శాంతినగర్ గ్రామానికి చెందిన రైతు కత్తుల ఓదెలు మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు బుధవారం దగ్ధం అయింది. బాధిత రైతు తెలిపిన కథనం ప్రకారం.. ఇటీవల పంటను కోసి వ్యవసాయ భూమిలోనే ఎండబెట్టారు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పంట మొత్తం కాలిపోయింది. సుమారు వంద క్వింటాళ్ల మొక్కజొన్న కాలిపోవడం చూసి బాధితుడు లబోదిబో మంటు బోరున విలపించాడు. ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

సెల్‌ఫోన్ అప్పగింత



రేగొండ : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి ఎస్సై సందీప్‌కుమార్ బుధవారం అందజేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన మంతెన రాజు రేగొండ నుంచి భూపాలపల్లికి వెళ్తుండగా ఫోన్ ఎక్కడో పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వివరాలు నమోదు చేసుకున్న పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



శ్రీలత (ఫైల్)

రేగొండ : మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన కంచరకుంట్ల శ్రీలత (38) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. గతేడాది డిసెంబర్‌లో దంపతుల మధ్య మాటమాట పెరగడంతో క్షణికావేశంలో శ్రీలత ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుంది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



తిరుపతిరెడ్డి (ఫైల్)

వెంకటాపురం(ఎం) : అనారోగ్య సమస్యలు భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నల్లగుంట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై జక్కుల సతీశ్ తెలిపిన కథనం ప్రకారం.. నల్లగుంటకు చెందిన మునిగంటి తిరుపతిరెడ్డికి (42) ఆరేళ్ల క్రితం వెన్నుముకకు ఆపరేషన్ జరిగింది. కొన్ని రోజుల తర్వాత రెండు కిడ్నీలు పాడయ్యాయి. షుగర్ సైతం రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో తిరుపతిరెడ్డి భార్య కీర్తన, కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి ఊరికి వెళ్లడంతో బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

వన మహోత్సవానికి సన్నద్ధం

- మండలంలో 2.50లక్షల మొక్కల పెంపకం
- మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని నర్సరీ

మొగుళ్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం పేరిట ప్రతి ఏటా గ్రామాల్లో మొక్కల పెంపకాన్ని చేపడుతోంది. వానాకాలంలో నాటిన మొక్కలను సంరక్షించడమే లక్ష్యంగా ముందుకెళ్తోంది. వచ్చే నెల నుంచి ఆరంభం కానున్న వర్షాకాలంలో నిర్వహించే వన మహోత్సవానికి వివిధ రకాల మొక్కలను ఇప్పటి నుంచే ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీల్లో పెంచుతున్నారు. ఈ ఏడాది జనవరిలో నర్సరీలను సిద్ధం చేసి మట్టితో నింపిన ప్లాస్టిక్ సంచుల్లో విత్తనాలు నాటారు. విత్తనాలు మొలకెత్తి ప్రస్తుతం వివిధ దశల్లో మొక్కలున్నాయి. నర్సరీల్లో మొక్కలకు ఎండ వేడి తగలకుండా షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా మండలంలోని నర్సరీల్లో 2.50 లక్షల మొక్కలు పెంచుతున్నారు. ఎండకు మొక్కలు వాడిపోకుండా నీటిని అందిస్తూ తగిన జాగ్రత్తలతో పాటు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. అన్ని నర్సరీల్లో గ్రీన్‌మ్యాట్ పందిళ్లు ఏర్పాటు చేశారు.

వన సేవకులు..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కల రక్షణకు అధికారులను వన సేవకులను నియమించారు. వన సేవకులు ప్రతిరోజు మొక్కలకు నీటిని అందిస్తున్నారు. నాటిన విత్తనాలు మొలకెత్తడానికి, పెరుగుతున్న మొక్కలను రక్షించడానికి వన సేవకులు నర్సరీల్లో నిరంతరం సంరక్షణ పనులు చేపడుతున్నారు.

2.50 లక్షల మొక్కల పెంపకం

మండల వ్యాప్తంగా 26 గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో జీపీకి ఒకటి చొప్పున నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలోని నర్సరీల్లో మొక్కల సంరక్షణకు వన సేవకులను నియమించారు. మొక్కల ఎదుగలకు చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీల్లో కలుపు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగించడం, ఏపుగా పెరిగిన మొక్కలను ఒకచోటికి మారుస్తున్నారు. పూలు, పండ్లు ఇతర మొక్కలను నర్సరీల్లో విరివిరిగా పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో 5 వేల నుంచి 6 వేల మొక్కలు పెంచుతున్నారు. మొత్తం 2.50 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

గ్రీన్‌మ్యాట్లు ఏర్పాటు చేశాం..



వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రతి గ్రామంలో అవసరమైన వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు ఆయా గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్నాం.

– సుభాష్ చంద్రబోస్, ఎంపీడీఓ, మొగుళ్లపల్లి

కిరణ్ ఆశయాలు కొనసాగించాలి



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

భూపాలపల్లి రూరల్ : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దివంగత నేత కిరణ్ ఆశయాలను కొనసాగించాలని ఆ యూనియన్ భూపాలపల్లి సర్కిల్ కార్యదర్శి మోత్కూరి కోటి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో కిరణ్ వర్ధంతిని నిర్వహించారు. యూనియన్ నాయకులు కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ.. సీఐటీయూ ద్వారా విద్యుత్ కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన కిరణ్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు రెగ్యులర్ ఉద్యోగులుగా కన్వర్షన్ అయ్యేంత వరకు, అన్‌మ్యాన్డ్ కార్మికులు ఆర్టిజన్లుగా సంస్థలో విలీన అయ్యేంత వరకు అమరుడైనా కిరణ్ పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్తామన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు యాల్ల సురేందర్‌రెడ్డి, అంకూషావలి, తులసగారి సమ్మయ్య, రాంటెంకి సమ్మయ్య, సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

అలరిస్తున్న చిరుతల రామాయణం



చిరుతల రామాయణం ప్రదర్శనలో కళాకారులు

కాటారం : మండల కేంద్రంలోని గారెపల్లిలో నిర్వహిస్తున్న చిరుతల రామాయణం అధ్యాత్మిక ప్రదర్శన అలరిస్తోంది. గారెపల్లికి చెందిన పలువురు రామాయణ పర్వంలోని పలు పాత్రలు పోషిస్తూ ఆకట్టుకుంటున్నారు. చిరుతల రామాయణం మూడో రోజు ప్రదర్శనలో భాగంగా మంగళవారం రాత్రి సీతారాముల కల్యాణం ఘట్టం నిర్వహించారు. సీతారాముల కల్యాణ సన్నివేశం కళ్లకు కట్టినట్టుగా కొనసాగగా పలు గ్రామాల నుంచి వచ్చిన వచ్చిన వారు వీక్షించి తరించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తల్లి జయమ్మ చిరుతల రామాయణంను తిలకించి పలు పాత్రల్లో అభినయిస్తున్న వారిని అభినందించారు. కాంగ్రెస్ పార్టీ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ కార్యక్రమ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా చిరుతల రామాయణం బృందం సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలు, యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సాంబమూర్తి, పోలీసులు

భూపాలపల్లి అర్బన్ : సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం సైబర్ జాగృతి దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో స్థానిక ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. పార్ట్ టైం టాస్క్ బేస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, జాబ్ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, నకిలీ ఇన్‌స్టా గ్రామ్, నకిలీ నంబర్ ప్లేట్లు సంబంధిత వెబ్‌సైట్ మోసాలు జరుగుతున్నాయని ఎస్సై సాంబమూర్తి తెలిపారు. యువకులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ములుగు : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ సందీప్‌రెడ్డి సూచించారు. సైబర్ జాగృతి దివస్ సందర్భంగా బుధవారం జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రి సమావేశ మందిరంలో సిబ్బందికి సైబర్ క్రైం నివారణపై సూచనలు చేశారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కి గాని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైం.గొ.ఇన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ములుగు ఎస్సై వెంకటేశ్వర్లు, సైబర్ క్రైం సిబ్బంది శ్రీకాంత్, శ్వేత పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి 'భూభారతి'

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ : రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు భాగిర్థిపేట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలిస్తూ సమస్యలకు పరిష్కారం లభించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రైతులను ఆయన కోరారు. ఈ సదస్సులో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు పరిశీలించి జూన్ 2వ తేదీన పట్టా పాస్ పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 10న మండలంలో జరిగే భూభారతి అవగాహన సదస్సులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని వివరించారు. తహసీల్దార్లు సత్యనారాయణ స్వామి, శ్వేత, మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు వీరబ్రహ్మం, ముద్దమల్ల రవి, ఏనుగు రవీందర్ రెడ్డి, షాబీర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు స్కూటీల పంపిణీ

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి నియోజకవర్గంలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎలక్ట్రికల్ స్కూటీలను పంపిణీ చేశారు. ఈసీఐఎల్ హైదరాబాద్ వారి సీఎస్ఆర్ ఫండ్‌తో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు మొత్తం 20 స్కూటీలు రాగా భూపాలపల్లి నియోజకవర్గానికి 14 కేటాయించారు. స్కూటీలు అందజేసిన ఎమ్మెల్యే బైక్‌లపై అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలని సూపర్‌వైజర్లకు సూచించారు. బైకులు తీసుకున్న సూపర్‌వైజర్లు ఈసందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మనువాద సంస్కృతిని ప్రోత్సహిస్తున్న బీజేపీ

- కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య



రాజుపేటలో పార్టీ నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సోమయ్య

మంగపేట : దేశంలో మనువాద సంస్కతిని బీజేపీ ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ మండల ఇన్‌చార్జ్ గుమ్మడి సోమయ్య పేర్కొన్నారు. మంత్రి సీతక్క, డీసీసీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజుపేట, కత్తిగూడెం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గుమ్మడి సోమయ్య మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ గతంలో అంబేడ్కర్ మనువాదాన్ని తిరస్కరిస్తు వాటి ప్రతులను దహనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మనువాదంలోని బ్రాహ్మణీయ సంస్కృతిని అవలంబించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని నిలబెట్టిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు. ఆయన రచించిన రాజ్యాంగాన్ని కించపరిచే విధంగా కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం అవమానకరమని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అమలు చేస్తున్న పథకాలను ప్రజలందరికి వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకు వచ్చిన మహానేతల కలలను సాకారం చేసేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు సాగుతామని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకుల, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి సన్మానం

మండలంలోని రాజుపేటలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి శాలువాతో సత్కరించి సన్మానించారు. భద్రాద్రికొత్త గూడెం జిల్లా మణుగూరు నుంచి జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయన కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాద పర్వకంగా సన్మానించారు. పార్టీ కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహిస్తున్న సోమయ్య, జైరాంరెడ్డి, పార్టీ నాయకులను ఆయన అభినందించారు.

విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు



విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల : మండలంలోని జడలపేట శివారు భీష్మనగర్ నుంచి చిట్యాలకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ఉంది. ఇదే విషయాన్ని బుధవారం సాక్షిలో 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేసి సరిచేశారు. అలాగే అదే స్థలంలో మరో పెద్ద స్తంభం వేయడానికి ప్రతిపాదనలు పంపించినట్లు, వచ్చిన వెంటనే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కాటారం : స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం మండలంలోని దేవరాంపల్లికి చెందిన మారుపాక లక్ష్మి అనే మహిళపై గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో అదే గ్రామానికి చెందిన నిందితుడు మారుపాక అంజిని బుధవారం అరెస్ట్ చేసినట్లు పీఎస్సై గీతారాథోడ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీఎస్సై నిందితుడి వివరాలు వెల్లడించారు. గతేడాది డిసెంబర్ 14న భూవివాదంలో అంజి తండ్రి మారుపాక సారయ్యను ఆయన తమ్ముడు సమ్మయ్య, మరో తమ్ముడి భార్య లక్ష్మి, వారి కుమారులు పెద్దఅంజీ, కిరణ్, సమ్మయ్య భార్య స్వప్న కిరాతకంగా హత్య చేశారు. దీంతో మృతుడి చిన్న కుమారుడు అంజి వారిపై ప్రతికారం పెంచుకొని వారిని ఎలాగైన అంతమొందించాలని అనుకున్నాడు. కాగా ఈ కేసులో నిందితులు జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యారు. కండీషన్ బెయిల్ కావడంతో ప్రతి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంతకం చేయాల్సి ఉంది. కాగా లక్ష్మి, ఆమె కుమారుడు కిరణ్ మండల కేంద్రానికి వచ్చారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న క్రమంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం పోలీస్ స్టేషన్‌కు సమీపంలో వేచి వున్న అంజి గొడ్డలితో ఒక్కసారిగా లక్ష్మిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో లక్ష్మి తలకు పలు చోట్ల గాయాలవగా గమనించిన స్థానికులు అడ్డుకోవడంతో నిందితుడు పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుగి కోసం గాలిస్తుండగా మంథని వైపు గల పెట్రోల్‌బంకు సమీపంలో వాహన తనిఖీల్లో భాగంగా పట్టుబడినట్లు పీఎస్సై తెలిపారు. నిందితుడి దగ్గరి నుంచి గొడ్డలి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పీఎస్సైతో పాటు సిబ్బందిని డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



ఎస్ఎస్‌తాడ్వాయి : అక్రమంగా తరలిస్తున్న పశువులను తాడ్వాయి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని తాడ్వాయి గ్రామంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కాటాపూర్ క్రాస్ వద్ద పోలీసులను గమనించిన బొలెరో వాహనం తిరిగి వెళ్లే ప్రయత్నం చేశారు. వారిని తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న 8 పశువులను పట్టుకున్నట్లు తెలిపారు. పశువుల రహదారి పత్రాలు లేకపోవడంతో పశువులతోపాటు బొలెరో వాహనం స్వాధీనం చేసుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని దుగినేపల్లికి చెందిన ఒడియాల వెంకన్న, మంగపేట మండలంలోని రమణక్కపేటకు చెందిన డ్రైవర్ మదారపు సాంబశివరావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే మండల కేంద్రంలోని ఆర్చీ వద్ద బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న మరో 6 పశువులను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఆర్ఎస్‌నగర్‌కు చెందిన డ్రైవర్ చల్ల వీరన్న, మణుగూరులోని బొంబాయి కాలనీకి చెందిన బత్తుల నవీన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండండి



వాజేడు: వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వాజేడు : వడదెబ్బతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈఓ పాయం వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని టేకులగూడెం గ్రామంలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 70 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ.. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, ఆశ కార్యకర్త కుమారి తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెం వద్ద బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు దుర్గం రాజుకుమార్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సఖ్యలో ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు. స్థానికులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

వెంకటాపురం(ఎం) : మండలంలోని పాలంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1995–96 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు బుధవారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. సుమారు 30 సంవత్సరాల క్రితం విడిపోయిన స్నేహితులు సమ్మేళనంలో పాల్గొని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు చెప్పిన గురువుల సేవలను గుర్తుచేసుకున్నారు. శాలువాలతో వారిని సన్మానించి ఆశీర్వాదం పొందారు. ఉపాధ్యాయులు చింతనిప్పుల మొగిలి, రఘువీర్ శ్రీనివాస్, సురేందర్, మధుసూదన్, సుంకరి సంపత్‌రావు, దేవేందర్, రాజేందర్, పూర్వ విద్యార్థులు సమ్మయ్య, అకినపల్లి నాగరాజు, రమేష్, ప్రసాద్, సతీశ్, రాజిరెడ్డి, ఆసీఫ్‌పాషా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.